క్లుప్తంగా

కల్యాణం..కమనీయం



కల్యాణవేదికపై శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటరమణ స్వామి

బైరెడ్డిపల్లె: మండలంలోని పట్నపల్లె శ్రీ కళ్యాణ వెంకట్రమణస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో బుధవారం రాత్రి కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. వివిధ రకాల పుష్పాలతో అలంకరించిన కళ్యాణ వేదికపై శ్రీదేవి భూదేవి సమేత కళ్యాణ వెంకట్రమణస్వామి ఉత్సవ మూర్తులను కొలువుదీర్చారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్ఛరణ నడుమ కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు.

గొడవలు సృష్టిస్తే చర్యలు

బైరెడ్డిపల్లె: గ్రామాల్లో గొడవలు సృష్టిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్ఐ క్రిష్ణయ్య హెచ్చరించారు. బైరెడ్డిపల్లె పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జూన్ 4వ తేదీన ఎన్నికల లెక్కింపు నేపథ్యంలో రాజకీయ నాయకులు సంయమనం పాటించి చట్టానికి లోబడి ప్రశాంతంగా ఉండాలన్నారు. పెట్రోల్ బంకుల్లో బాటిల్స్, క్యాన్లలో విడిగా పెట్రోలు, డీజిల్ పోయకూడదని, దుకాణాల్లో విడిగా పెట్రోల్ విక్రయించరాదన్నారు.

బాటిళ్లలో పెట్రోల్ ఇవ్వొద్దు

రామకుప్పం: పెట్రోల్ బంకులలో పెట్రోల్, డీజిల్‌ను బాటిళ్లు, క్యాన్లలో ఇవ్వరాదని తహసీల్దార్ శ్రీధర్ ఆదేశించారు. స్థానిక పెట్రోల్ బంకును బుధవారం తహసీల్దార్ తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ, ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో నియమ నిబంధనలకు లోబడి వాహనాలకు మాత్రమే పెట్రోల్, డీజిల్ పట్టాలన్నారు.

మృతులకు జెడ్పీ చైర్మన్ నివాళి



నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

వి.కోట: మండలంలోని బాలేంద్రపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త రాఘవరెడ్డి, ఎర్రినాగేపల్లెకు చెందిన సింగిల్ విండో చైర్మన్ బాలవర్ధన్ మాతృమూర్తి మృతి చెందారు. ఇది తెలుసుకున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు బుధవారం మృతుల స్వగృహాలకు వెళ్లి, వారి మృతదేహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

ఆస్పత్రికి వెళితే.. ఇంట్లో దొంగలు పడ్డారు

పుంగనూరు: దొంగలు పడి చోరీ చేసిన సంఘటన బుధవారం పట్టణంలోని మేలుపట్లలో వెలుగులోకి వచ్చింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు.. మేలుపట్లలో నివాసం ఉంటున్న ఓబులమ్మ తన కాలికి దెబ్బతగలడంతో స్థానిక ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం వెళ్లింది. రాత్రి అక్కడే ఉండి ఉదయం ఇంటికి వచ్చింది.ఇంటి తాళాలు పగలగొట్టి ఉండటంతో అనుమానించింది. లోనికి వెళ్లి చూస్తే దొంగలు పడి చోరీ చేసినట్లు గ్రహించింది. ఇంట్లో ఉన్న చిన్న బంగారు ఆభరణాలు, అలాగే ఇతర వస్తువులు దొంగలించుకెళ్లారు. బుధవారం ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కూలీలందరికీ 'ఉపాధి'

పులిచెర్ల(కల్లూరు): జాబ్‌కార్డు కలిగి ఉన్న కూలీలందరికీ 'ఉపాధి' పనులు కల్పించి, పనుల్లో వారి సంఖ్యను పెంచాలని ఉపాధి హామీ పథక ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్. రాజశేఖర్ ఆదేశించారు. బుధవారం కావేటిగారిపల్లె పంచాయతీలో అదిరిగుండ్ల ప్రాంతంలో మినీ అమృత్ సరోవర్ పనులను, రఘునాథరెడ్డి పొలాల నుంచి కోనేటిచెరువు వరకు చేస్తున్న ఫీడర్ ఛానల్ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం కూలీల హాజరు పట్టికను తనిఖీ చేసి వారితో మాట్లాడారు. ఏపీఓ షౌకత్‌అలీ, ఈసీ కృష్ణ, టీఏ మహీంద్ర క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

శాంతిపురం: వర్షాలు ప్రారంభమైన నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ప్రభావతిదేవి సిబ్బందిని ఆదేశించారు. గురువారం శాంతిపురం ప్రాథమిక వైద్యశాలలో ఆమె మండల వైద్యాధికారి వంశీకృష్ణ, ఏఎన్‌ఎంలతో సమావేశమయ్యారు. పారిశుధ్య సమస్యలు ఏవైనా ఉంటే పంచాయతీ పాలకవర్గాల దృష్టికి తెచ్చి పరిష్కరించాలని చెప్పారు. దోమలు, ఈగల ఉధృతి పెరగకుండా ఉండేందుకు నీరు నిల్వ ఉండే ప్రాంతాలపై దృష్టి సారించాలన్నారు. క్షయ వ్యాధి నివారణ కోసం ఉచితంగా ఇస్తున్న బీసీజీ టీకా మందును పెద్దలందరూ వేసుకునేలా చూడాలన్నారు.

జనార్దన్‌కు డాక్టరేట్



తిరుపతి సిటీ : ఎస్వీయూ జాగ్రఫీ విభాగం పరిశోధక విద్యార్థి తూపల్లి జనార్దన్‌కు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఆయన ప్రొఫెసర్ వై సుజాత పర్యవేక్షణలో ఎ స్టడీ ఆఫ్ స్లమ్స్ ఇన్ ది మున్సిపల్ టౌన్స్ ఆఫ్ చిత్తూరు డిస్ట్రిక్ట్, ఆంధ్రప్రదేశ్ ఎ సోషియో ఎకనమిక్ సర్వే అనే అంశంపై పరిశోధనా పత్రాలు సమర్పించారు.

అంగరంగ వైభవంగా
విశ్వరూప దర్శనం



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

- భక్త జనంతో కిక్కిరిసిన కుప్పం
- అమ్మవారి వేషధారణతో మొక్కులు చెల్లించిన భక్తులు
- దర్శనం కోసం బారులు తీరిన జనం

కుప్పం: శ్రీ ప్రసన్న తిరుపతి గంగమాంబ జాతర చివరి రోజు అమ్మవారి విశ్వరూప దర్శనానికి జనం పోటెత్తారు. ఎప్పుడూ లేని విధంగా ఈసారి విశ్వరూప దర్శనం అంగరంగ వైభవంగా జరిగింది. కుప్పం చుట్టుపక్కల ప్రాంతాల నుంచే కాకుండా కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలతో పాటు అనంతపురం, కడప, చిత్తూరు ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. టెంపోలు, కార్లు తదితర వాహనాలలో వచ్చి, పట్టణ పొలిమేర్లలో అమ్మవారి దర్శనం కోసం నిరీక్షించారు. పట్టణం చెరువు కట్ట నుంచి హెచ్‌పీ రోడ్డు, బైపాస్, రైల్వే గేటు వరకు ఉన్న రహదారుల్లో వాహనాలను అనుమతించకుండా పోలీసు శాఖ పకడ్బందీగా బందోబస్తు నిర్వహించింది. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులు వాహనాలను పొలిమేర్లలో నిలిపి వేసి ఆలయానికి నడచి వచ్చేలా చర్యలు తీసుకున్నారు. దీంతో కుప్పం చుట్టూ వాహనాలతో పాటు జన సందోహంతో పట్టణం కిక్కిరిసింది. ఆలయ ప్రాంగణంలో అమ్మవారి దర్శనం కోసం ఆలయ కమిటీ ఏర్పాటు చేసిన క్యూలలో భక్తులు గంటల తరబడి నిరీక్షించి అమ్మవారిని దర్శించుకున్నారు.

పోలీసుల ఓవరాక్షన్

ప్రతి ఏటా అమ్మవారి విశ్వరూప దర్శనంలో భక్తులకు అధిక ప్రాధాన్యత ఇచ్చేవారు. ఈ ఏడాది ఎన్నికల కోడ్ పేరిట పోలీసులు భక్తులను తీవ్ర ఇబ్బందులు గురిచేశారు. క్యూలలో పోలీసుల దురుసు ప్రవర్తన భక్తుల మనోభావాలను దెబ్బతీసింది. అమ్మవారి గర్భగుడి లోపలికి ఎవరికీ ప్రవేశం లేకుండా నిబంధనలు పెట్టి ఓవరాక్షన్ చేశారు. దీంతో భక్తులు క్యూలలో వెళ్లకుండా దేవస్థానం ఎదురుగా రోడ్డుపైన అమ్మవారిని దర్శించుకుని వెనుదిరిగారు. కుప్పంలో జరిగే అమ్మవారి జాతరకు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి వేల సంఖ్యలో భక్తులు తరలి రావడం, వీరి వల్ల అమ్మవారి హుండీ ఆదాయం గణనీయంగా లభించడం పరిపాటి. అయితే పోలీసులు ఈ పర్యాయం అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులను తమ నిబంధనలతో ఇబ్బందులకు గురి చేయడంతో నిరాశతో తిరుగుముఖం పట్టారు. ఇది హుండీ ఆదాయంపై కూడా ప్రభావం చూపే అవకాశం లేకపోలేదు.

విచిత్ర వేషధారణలతో భక్తులు

శ్రీ ప్రసన్న తిరుపతి గంగమాంబకు ఎంతో ఇష్టమైన వేషధారణలతో భక్తులు తరలి వచ్చారు. స్త్రీ వేషధారణలు, గంగమ్మ రూపాలు, మహాభారత పాత్రధారుల వేషధారణతో డప్పులు వాయిస్తూ, నృత్యం చేస్తూ వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. అంతేకాకుండా సాధారణంగా మహిళలు పసుపు, కుంకుమతో కూడిన సారె (వడిబాల)ను చెల్లించారు.



విచిత్ర వేషధారణలతో భక్తులు

అమ్మవారి ఊరేగింపు



జలధితో ముగిసిన జాతర

- భక్తులతో కిక్కిరిసిన బజారువీధి



జలధిలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు, దేవతామూర్తుల అవతారాలు

పలమనేరు: పట్టణంలో తిరుపతి గంగమ్మ జాతర బుధవారం అమ్మవారి జలధితో ముగిసింది. తెల్లవారుజామున అమ్మవారి ఆలయం నుంచి శిరస్సు మెరవణిని బజారువీధి, జిలానీ క్రాస్, రామ లక్ష్మణ థియేటర్ రోడ్డు మీదుగా గాంధీనగర్ చివరి వరకు ఊరేగించారు. పోటెత్తిన అమ్మవారి భక్తులు ప్రత్యేక పూజలు చేయడంతో పాటు భారీగా టెంకాయలను కొట్టి మొక్కులు చెల్లించారు. జలధి సందర్భంగా ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను ఆకట్టుకున్నాయి. దేవతామూర్తుల వేషంలో భక్తులను అలరించారు. జనం సైతం నృత్యాలు చేస్తూ తమ భక్తిని చాటుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసుల పటిష్ట బందోబస్తు నిర్వహించారు. ఇదిలా ఉండగా ఆలయం వద్ద పగలు తోపు, వసంతోత్సవం నిర్వహించారు. గురువారం ఆలయం వద్ద హుండీ లెక్కింపు, అమ్మవారి చీరల వేలం నిర్వహించనున్నట్టు ఈఓ కమలాకర్ తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో జాతరను ప్రశాంతంగా జరిగేందుకు కారణమైన పట్టణ వాసులకు స్థానిక సీఐ చంద్రశేఖర్, ఈఓ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, రాజకీయ పార్టీలకతీతంగా నాయకులు, పట్టణ పెద్దలు, జాతర తాత్కాలిక కమిటీ నిర్వాహకులు, పట్టణ వాసులు పాల్గొన్నారు.



జనంతో కిక్కిరిసిన బజారు వీధి

సూర్యప్రభలో బద్రీనారాయణుడి కటాక్షం



సూర్యప్రభ వాహనంపై విహరిస్తున్న కోనేటిరాయుడు

గంగవరం: మండలంలోని కీలపట్లలో నిర్వహిస్తున్న అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడైన శ్రీకోనేటిరాయ స్వామివారి బ్రహ్మోత్సవాల్లో 7వ రోజు బుధవారం స్వామివారు సూర్య, చంద్రప్రభ వాహనాలపై పురవీధుల్లో విహరిస్తూ భక్తులకు అభయమిచ్చారు. ఉదయం స్వామివారిని సుప్రభాతంతో మేల్కొలిపి తోమాలసేవ, సహస్ర నామార్చన, అభిషేకం, ఘంటానాదం అనంతరం నైవేద్యం సమర్పించారు.

సూర్యప్రభలో అలంకార భూషణుడై..

వాహన మండపంలోకి వేంచేసిన శ్రీవారు స్వర్ణాభరణాలతో అలంకార భూషణుడిగా మెరుస్తూ భక్తుల దర్శనార్థమై తిరు వీధుల్లో విహారంగా బయలుదేరారు. బద్రీనారాయణుడి అవతారంలో సూర్యప్రభ వాహనంలో విహరిస్తున్న శ్రీవారిపై భానోదయుని కిరణాలు పడుతూ అత్యంత ప్రకాశవంతుడిగా భక్తులకు దర్శనమిచ్చారు. సూర్యప్రభ వాహనంలో స్వామివారిని దర్శిస్తే ఇతోధిక భోగభాగ్యాలు, అష్టైశ్వర్యాలు, ఆయురారోగ్యాలు సిద్ధిస్తాయని భక్తుల విశ్వాసం. వాహన సేవ ఎదుట భక్తులు టెంకాయలు కొట్టి కర్పూర హారతులు సమర్పించారు. వాహన సేవ అనంతరం స్వామివారు తిరిగి ఆస్థాన మండపానికి చేరుకున్నారు. ఆ తరువాత సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేతంగా శ్రీవారు ఉయ్యాలపై వేంచేసి కేళీవిలాసంగా ఊగుతూ సేదతీరారు.

అంత రంగిక దర్బార్‌లో కృష్ణుడిగా..

రాత్రి శ్రీకోనేటిరాయుడు చంద్రప్రభ వాహనంపై దర్బార్ కృష్ణుడి అవతారంలో పురవీధుల్లో విహరిస్తూ భక్తులను కనువిందు చేశారు. ఏడు రోజులుగా విహరిస్తూ అలసిసొలసి తన అంతరంగిక దర్బార్‌లో విశ్రాంతి తీసుకుంటున్నటువంటి దర్బార్ కృష్ణుడిగా అవతరిస్తారని పురాణ ప్రశస్తి. చంద్రుడు శివునికి శిరోభూషణుడైతే శ్రీహరికి వాహనంగా ఉండటం విశేషం. వెంకటాద్రిపై కొలువున్న శ్రీనివాసునికి సూర్య, చంద్రులు రెండు కళ్లు. సూర్యకాంతితోనే చంద్రుడు కూడా ప్రకాశిస్తాడు. సూర్యచంద్రుల కిరణాలు శ్రీవారిని ప్రకాశింపజేస్తూ వాహన సేవలు శోభాయమానంగా సాగాయి.



చంద్రప్రభ వాహనంపై శ్రీనివాసుడు

బ్రహ్మోత్సవాలలో నేడు

గురువారం ఉదయం స్వామివారి రథారోహణం, రథోత్సవం, రాత్రికి అశ్వ వాహనంపై శ్రీవారు విహరిస్తున్నట్టు టిటిడి అధికారులు తెలిపారు.

హనుమంత వాహనంపై విహారం



హనుమంత వాహనంపై శ్రీవారి ఊరేగింపు

సదుం: మండలంలోని బూరగమంద శ్రీదేవీ భూదేవీ సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలలో బుధవారం రాత్రి ఉత్సవమూర్తులు హనుమంత వాహనంపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఉదయం అభిషేకాలు, విశేష పూజలు, ప్రత్యేకాలంకారం చేశారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. రాత్రి మేళతాళాలతో హనుమంత వాహనంపై ఊరేగిన ఉత్సవమూర్తులకు భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించారు.

గరుడ వాహనంపై శ్రీనివాసుని చిద్విలాసం



గుడుపల్లె: మండలంలో కనమనపల్లెలోని శ్రీ పద్మావతి సమేత శ్రీనివాసస్వామి ఆలయంలో బుధవారం గరుడ వాహనంపై స్వామివారు విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. తొలుత ఆలయంలో వేద పండితులు స్వామి వారిని ప్రత్యేక అలంకరణం చేసి గరుడ వాహనంపై కొలువుదీర్చారు. మంగళవాయిద్యాల హోరు నడుమ గోవింద నామస్మరణ చేస్తూ ఆలయం చుట్టూ ఊరేగించారు. భక్తులు విశేషంగా వచ్చి స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. రాత్రి రాజ గోపురాన్ని శోభాయానంగా విద్యుద్దీపాలతో అలంకరించి కార్యక్రమాలు నిర్వహించారు.

సబ్సిడీ విత్తనాలు సద్వినియోగం చేసుకోండి



గంగవరం : విత్తన నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న పుంగనూరు ఏడీఏ శివకుమార్



బైరెడ్డిపల్లె : ఆర్‌బీకేలో రిజిస్ట్రేషన్ చేసుకుంటున్న రైతులు

పెద్దపంజాణి: ప్రభుత్వం సబ్సిడీపై అందజేస్తున్న వేరుశనగ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పుంగనూరు ఏడీఏ శివకుమార్ కోరారు. బుధవారం మండలంలోని వీరప్పల్లె, రాయలపేట, కమ్మపాళ్యం, అప్పినపల్లె, పెద్దవెలగటూరు రైతు భరోసా కేంద్రాలలో విత్తన పంపిణీకి సంబంధించి నమోదు ప్రక్రియను ఆయన పరిశీలించి మాట్లాడారు. మండలంలోని రైతులకు గురువారం నుంచి సబ్సిడీ వేరుశనగ విత్తన కాయలు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. మండలంలోని 19 ఆర్‌బీకేలలో 1980 క్వింటాళ్ల విత్తన కాయలు సిద్ధంగా ఉన్నాయని, 30 కిలోల బస్తాపై సబ్సిడీ పోను రూ 1710లకే ఇవ్వనున్నట్లు చెప్పారు. అవసరమైన రైతులు పట్టాదారు పాసుపుస్తకం జెరాక్స్, ఆధార్ లింక్ అయిన ఫోన్‌తో వచ్చి బయోమెట్రిక్ ద్వారా పొందాలని కోరారు.

విత్తన రిజిస్ట్రేషన్‌కు స్పందన

బైరెడ్డిపల్లె: సబ్సిడీ వేరుశనగ విత్తన రిజిస్ట్రేషన్‌కు మంచి స్పందన లభిస్తోంది. ఈనెల 23 నుంచి వేరుశనగ విత్తనాలు పంపిణీ చేయనుండడంతో బుధవారం రిజిస్ట్రేషన్లకు రైతులు వచ్చారు. వ్యవసాయాధికారిణి గీతాకుమారి మాట్లాడుతూ, 30 కిలోల బస్తా సబ్సిడీ పోను రూ.1710 చెల్లించాలన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు మాత్రమే వేరుశనగ కాయలు ఇస్తామన్నారు. మండలంలోని అన్ని ఆర్‌బీకేల్లో సబ్సిడీ విత్తన వేరుశనగ కాయల కోసం రిజిస్ట్రేషన్లు చేస్తున్నామని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఏఓ కోరారు.

గంగవరంలో..

గంగవరం: వేరుశనగ విత్తనాల పంపిణీకి సంబంధించి బుధవారం మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లో ఆర్‌బీకే సిబ్బంది నమోదుకు శ్రీకారం చుట్టారు. పట్టాదారు పాస్‌బుక్, ఆధార్‌తో సెల్ ఫోన్ ఓటీపీ ద్వారా విత్తనాలు పొందేందుకు రైతులు నమోదు చేసుకున్నారు. ఖరీఫ్ 2024కు సంబంధించి మండలానికి మొత్తం 1440 క్వింటాళ్ల వేరుశనగ విత్తన కాయల బస్తాలు ఇప్పటికే ఆయా గ్రామ సచివాలయాల పరిధిలో రైతులకు అందుబాటులో ఉంచినట్టు ఏఓ హేమలత తెలిపారు.కల్లుపల్లె, పత్తికొండ, గుండుగల్లు గ్రామ సచివాలయాల వద్ద విత్తన నమోదు కార్యక్రమాన్ని పుంగనూరు ఏడీఏ శివకుమార్ పరిశీలించారు. విత్తనాలు పొందిన ప్రతి రైతూ తప్పనిసరిగా పొలంలో విత్తుకోవాలని కోరారు.

నేటి నుంచి శాంతిపురంలో..

శాంతిపురం: రైతులకు సబ్సిడీపై వేరుశనగ విత్తన కాయలను గురువారం నుంచి పంపిణీ చేస్తున్నట్టు మండల వ్యవసాయాధికారి అప్పోజి తెలిపారు. తొలి విడతగా 30 సొన్నేగానిపల్లె, దండికుప్పం, ఎంకె పురం, మఠం, కొలమడుగు, శివరామపురంలో పంపిణీ చేస్తామన్నారు. మిగతా సచివాలయాలలో పంపిణీ తేదిని త్వరలో ప్రకటిస్తామని చెప్పారు. రైతులు తమ పట్టాదారు పాసుపుస్తకాలు, మొబైల్ ఫోను ద్వారా ఆర్బీకేలలో నమోదు చేసుకుని 30 కిలోల బస్తా రూ 1,710 చెల్లించి విత్తనాలు పొందాలన్నారు.

ఉచిత వైద్య శిబిరం రేపు

సదుం: స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు నిర్వాహకుడు, వైస్ సర్పంచ్ బాబురెడ్డి తెలిపారు. అశ్విని హాస్పిటల్(పీలేరు) ఆధ్వర్యంలో నిర్వహించే ఈ శిబిరంలో మెటర్నటీ, కీళ్ల సంబంధిత రోగాలకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేస్తారని ఆయన చెప్పారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నిర్వహిస్తామని, మండల ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రొంపిచెర్లలో మంచి మెజార్టీ తథ్యం



మంత్రితో మండల వైఎస్సార్‌సీపీ నాయకులు

రొంపిచెర్ల: మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని మండల వైఎస్సార్‌సీపీ నాయకులు మంత్రి నివాసంలో బుధవారం కలిశారు. సాధారణ ఎన్నికలలో రొంపిచెర్ల మండలంలో నాయకులు అందరు కలసికట్టుగా వైఎస్సార్‌సీపీ గెలుపుకోసం కృషి చేసినట్లు తెలియజేశారు. ఎన్నికల్లో మండలం నుంచి మంచి మెజార్టీ వస్తుందని పేర్కొన్నారు.మంత్రిని కలిసిన వారిలో ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి, జెడ్పీటీసీ రెడ్డీశ్వర్ రెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ ఇబ్రహీంఖాన్, సింగిల్‌విండో అధ్యక్షుడు హరినాథరెడ్డి, కోటా వెంకటరమణ, కరంతుల్లా బేగ్, అలీంఖాన్, చిన్న నాగరాజ, లక్ష్మయ్య, కాలేషా, మస్తాన్, హిమయతుల్లా బేగ్, కరీముల్లా, బషీర్, మల్లికార్జునరెడ్డి, ఓబులేసు, రవి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీ నరసింహస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకారంలో లక్ష్మీనరసింహస్వామి

పుంగనూరు: మండలంలో ఏదూరు గ్రామ సమీపంలోని శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో బుధవారం ఆలయ ప్రధాన అర్చకులు నటరాజ స్వామి ఆధ్వర్యంలో పౌర్ణమి పూజలు, హోమాలు చేశారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.